క్లుప్తంగా

డ్రగ్స్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ సునీల్

మధురవాడ: విద్యార్థులు డ్రగ్స్, సైబర్ మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని, వ్యసనాలకు లోనైతే ఉజ్వలమైన భవిష్యత్ అంధకారమయమవుతుందని విశాఖ నార్త్ జోన్ ఏసీపీ సునీల్ చెప్పారు. శనివారం సాయంత్రం మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్, సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగిస్తే ఆరోగ్యం క్రమంగా క్షీణించి భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రయోజకులను చేయాలని పరితపిస్తారని, ఆ విషయం మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఎం పాలెం ఎస్ఐ వై. రామకృష్ణ పాల్గొన్నారు.

గోతుల్లో నీరు.. ప్రయాణికుల ఇక్కట్లు



పద్మనాభం జంక్షన్ వద్ద గోతుల్లో వర్షంనీరు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ జంక్షన్ మీదుగా తగరపువలస, భీమునిపట్నం, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీలు తిరుగుతూ ఉంటాయి. జంక్షన్‌లో రోడ్డు మధ్యలో గోతులుండడంతో వర్షంనీరు నిల్వ ఉండిపోతోంది. దీని వల్ల ఆటోలు, లారీలు వెళ్లేటప్పుడు నీరు తుళ్లి పాదచారులపై పడడడంతో దుస్తులు పాడవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతను పంపిణీ చేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో శనివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక విజయరాంపురం గ్రామ కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి వివరంగా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, బి.పైడన్న, కె.పోలీస్ నాయుడు, వి.భవాని, కె.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మధురవాడ జోన్ ఏసీపీ బి.సునీల్ శనివారం పలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరా వలన కలిగే అనర్థాలను వివరించారు. అలాగే సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ సమస్యల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భీమిలి సీఐ డి.రమేష్, ఎస్ఐ గంటా హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.



రంగు కాయితాలతో బొమ్మలు తయారు చేస్తున్న పిల్లలు



పదేళ్ల క్రితం ఇక్కడ విలేజ్‌లో జరిగిన హోలీ వేడుకలో పాల్గొన్న క్రికెటర్ విరాట్ కోహ్లీ

అనాథలకు అమ్మ...


- ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్..
- కంటికి రెప్పలా కాపాడుతూ విద్యాబుద్ధులు
- ఉద్యోగం వచ్చే వరకూ సంరక్షణ
- నేడు ఎస్‌వోఎస్ డే



ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్



2007లో ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డికి రాఖీ కడుతున్న బాలిక (ఫైల్)



ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ విగ్రహం

భీమునిపట్నం: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలను ఆదరించి బాగోగులు చూసి మంచి భవిష్యత్తును అందిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది భీమిలిలో ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్. ఆస్ట్రియా దేశానికి చెందిన హెర్మన్ మైనర్ అనే మహానుభావుడు ఈ చిల్డ్రన్ విలేజ్‌లు ఏర్పాటుకు కారకుడు. రెండో ప్రపంచ యుద్ధం పూర్తయిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది పిల్లలు తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిపోయారు. వీరిని చూసి చలించిపోయిన హెర్మన్‌మైనర్ వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో 1949లో ఆస్ట్రియా దేశంలో మొదటి చిల్డ్రన్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత ప్రపంచ వ్యాప్తంగా 132 దేశాల్లో 500 విలేజ్‌లు ఉండగా భారతదేశంలో మొదటి విలేజ్ 1962లో ప్రారంభం కాగా ఇప్పుడు దేశవ్యాప్తంగా 32విలేజ్‌లు ఉన్నాయి. మన రాష్ట్రంలో విశాఖ జిల్లా భీమిలి సమీపంలో 1997లో విశాలమైన ప్రాంతంలో 14 ఇళ్లతో కూడిన చిల్డ్రన్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత తిరుపతి, హైదరాబాద్‌లలో మరో రెండు ఏర్పాటయ్యాయి. అన్ని ప్రాంతాల్లోని విలేజ్‌లతోపాటు ఇక్కడ కూడా ఇంటికి ఒక మదర్ ఉంటారు. అందులో పదిమంది వరకు పిల్లలు ఉంటారు. వీరిని మదర్ ఎటువంటి లోటు లేకుండా పెంచి పెద్ద చేస్తారు. వారికి మంచి చదువు చెప్పించడంతోపాటు ఉద్యోగాలు వచ్చే విధంగా చూస్తారు. ఆడ పిల్లలకు వివాహాలు చేసి పంపుతారు. ఈ విలేజ్‌కు ఒక డైరెక్టర్, పలువురు సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం ఇక్కడ 84 మంది పిల్లలు ఉన్నారు. కాగా 13 ఏళ్లు వచ్చిన మగ పిల్లల్ని మరో ప్రాంతంలో ఉండే యూత్ హాస్టల్‌లో ఉంచి చదివిస్తారు. ఇలా ఈ చిల్డ్రన్స్ విలేజ్‌లో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వారిని ఎంతో బాధ్యతగా ప్రేమతో పెంచి బంగారు భవిష్యత్తును అందిస్తున్నారు.

నేడు ఎస్‌వోఎస్ డే

ఆదివారం విలేజ్‌లో ఎస్‌వోఎస్ డే వేడుకను నిర్వహించనున్నారు. దీని వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. చదువు, క్రీడల్లో రాణించిన పిల్లలకు బహుమతులు అందజేస్తామన్నారు.

జీవితంలో యోగా భాగమవ్వాలి



దివీస్ ఉద్యోగులతో ఎండీ మురళీకృష్ణ దివి

తగరపువలస: నిత్య జీవితంలో యోగా భాగమవ్వాలని దివీస్ ఎండీ మురళీకృష్ణ దివి అన్నారు. శనివారం భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో యోగా పై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ దేశాలలో ప్రాచుర్యం పొందిన యోగాను నిత్యం ఆచరించడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతిరోజూ వ్యాయామంలో దీనిని చేర్చుకోవాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ యోగా చేసేలా ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ దివి, డైరెక్టర్ ఎస్.దేవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్లు ఎం.ఎస్.ఎన్ రావు, వైఎస్ కోటేశ్వరరావు ఇతర జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం మిగిలిన కార్మికులకు వెంటనే పీఎఫ్ బకాయిలు చెల్లించాలని కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీఎఫ్ కార్యాలయం అధికారులు జ్యూట్ మిల్లు యాజమాన్యం నుంచి ఆడిట్ వివరాలు కోరిన తరువాత ఇచ్చారన్నారు. తరువాత నుంచి మిల్లు పీఎఫ్ అధ్యక్షుడు లలిత్‌కుమార్ స్పందించకపోడంతో రెండేళ్లుగా బకాయిలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా లలిత్ మోహన్ స్పందించి పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి బకాయిలపై పరిష్కారం చూపకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ప్రభుత్వం కూడా కార్మికులకు రావలసిన పీఎఫ్ బకాయిలపై చొరవ తీసుకోవాలన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

పీఎంపాలెం: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా బొబ్బిలి వీధి ఇచ్ఛాపురానికి చెందిన ఆసి ఉమాపతి (32)మారికవలసలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పైప్‌లైన్ వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గాయపడిన అతడ్ని గాయత్రీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని సీఐ తెలిపారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.వి.ఆర్. రాజు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగ ఆచార్యులు ఎం.వి.ఆర్. రాజు నియమితులయ్యారు. శనివారం ఆచార్య కె.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఆర్.పద్మశ్రీ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు.

'అపోలో'లో గుండె జబ్బుకు అరుదైన శస్త్రచికిత్సలు



అపోలో వైద్యుల సమక్షంలో మాట్లాడుతున్న పేషెంట్ బంధువు

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో వైద్యులు ఇటీవల గుండె వ్యాధికి సంబంధించి ఇద్దరు వ్యక్తులకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ బారువ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. 63 ఏళ్ల వయసు గల ఓ వైద్యుడు ఎల్వీ సిస్టోలిక్ డిస్‌ఫంక్షన్‌తో తీవ్రమైన కాల్సిఫిక్ ఆర్టిక్ స్టెనోసిస్‌తో కొన్నాళ్లుగా బాధపడేవారన్నారు. ఈ వ్యాధితోపాటు ఆయనకు మూత్రపిండాల వ్యాధి, పెరిఫెరల్ వాస్కులర్ వ్యాధి కూడా ఉందేవని చెప్పారు. ఆయనకు ఇక్కడ నూతన పద్ధతిలో గుండె వైద్యుల బృందంతో కలసి బృహద్ధమని కవాటం ట్రాన్స్‌కాథెటరీ రీప్లేస్‌మెంట్‌ను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నారన్నారు. మరో 72 ఏళ్ల వయసు గల మహిళ బృహద్ధమని సంబంధిత స్టెనోసిస్ వ్యాధితో తీవ్రమైన బాధపడేవారన్నారు. ఆమెకు స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ చికిత్స విధానంతో సర్జరీ చేశామన్నారు. ఆయా వ్యక్తులకు చేసిన రెండు శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయని వెల్లడించారు.

సిద్ధమైన జూ పార్క్ బస్ బే



జూ పార్కు ముందు నిర్మించిన బస్ బే

ఆరిలోవ: నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం జీవీఎంసీ ఆధునిక బస్ బేలను కొన్నాళ్లుగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగా జూ పార్కుకు వెళ్లే సందర్శకుల కోసం బస్ బే నిర్మాణం చేపట్టింది. జాతీయ రహదారిని ఆనుకొని జూ ప్రధాన ద్వారం పక్కన ఇటీవల జీవీఎంసీ అధికారులు బస్ బే నిర్మించారు. అధికారకంగా ప్రారంభానికి ఇక్కడ బస్ బే సిద్ధమైంది. ఇక్కడ షెల్టర్‌లో కిందన గచ్చు, లోపల ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా నిర్మాణం చేపట్టారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో జూ పార్కుకు వెళ్లే సందర్శకులు ఇబ్బంది పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జూ అధికారులు ఇటీవల ఇక్కడ బస్ బే నిర్మించాలని కోరుతూ జీవీఎంసీకి లేఖ రాశారు. దీనికి స్పందించిన అధికారులు బస్ బే నిర్మించారు. దీంతో జూ పార్కుకు వెలుతున్న సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోవిందా... గోవిందా



శ్రీవారిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తుల పెద్ద ఎత్తునబారులు తీరారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు కుంకుమ సమర్పించి, శ్రీవారిని దర్శనం చేసుకున్న అనంతరం మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆక్రమణల తొలగింపు



సాయిప్రియ గార్డెన్ రోడ్డు వద్ద తొలగించిన ఆక్రమణ



కొబ్బరి మొక్కలు వేసి ఆక్రమణకు సిద్ధం చేసిన స్థలం

మధురవాడ: విశాఖ రూరల్ మండలం సాయిప్రియ గార్డెన్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఎంవీవీ భారీ వెంచర్ సమీపంలో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. దీనిని సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బక్కన్నపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 68లో గల ప్రభుత్వ గెడ్డ భూమికి బక్కన్నపాలెంకి చెందిన ఎస్. సన్యాసిరావుతో పాటు మరో వ్యక్తి పక్కనే ఉన్న సర్వే నంబరు.67/6ఏ నంబరుతో 200గజాలకు డాక్యుమెంట్ సృష్టించారు. వీరికి అండగా విజయనగరానికి చెందిన మరో వ్యక్తి నిలవడంతో సదరు స్థలంలో రేకులు షెడ్ నిర్మించారు. దీంతో పాటు చుట్టు పక్కల ఉన్న మరో 200 గజాల స్థలానికి కలిపి ప్రహరి నిర్మాణం చేసి అందులో కొబ్బరి, ఇతర మొక్కలు వేసి ఆక్రమణకు రెడీ అయ్యారు. విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. వీఆర్వో, ఇతర సచివాలయ కార్యదర్శులు లీనా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నువ్వు పైరుకు జీవం



తాటితూరులో సాగవుతున్న నువ్వుపంట

తగరపువలస: ఇటీవల కురిసిన వర్షాలకు సాగులో ఉన్న నువ్వుపైరుకు జీవం వచ్చినట్లు అయింది. ఏప్రిల్ చివర మొదలుకుని మే మొదట్లో భరణి, కృత్తిక కార్తెలు నువ్వుసాగు శ్రీకారానికి మంచిదని భావించిన రైతులు విరివిగా విత్తనాలు జల్లారు. కానీ మొదట్లో వర్షాభావం పంట ఎండిపోవడానికి కారణమైతే , తరువాత అధిక వర్షాలు నువ్వు పంటను తుడుచుకుపెట్టుపోయేలా చేసింది. రైతు తాను వేసిన పంటలో మూడోవంతు పాడైపోగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నువ్వులసాగు నిగారిస్తోంది. ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల సాగు ఖర్చు అయ్యే నువ్వులకు మూడు బస్తాల దిగుబడి లభిస్తుంది. ప్రస్తుతం వంద కిలోల నువ్వుల బస్తా రూ.11వేల నుంచి రూ.12 వేల ధర పలుకుతోంది. అంటే పెట్టుబడికి మూడు రెట్లు ఆదాయం లభిస్తోంది. చాలా మంది రైతులు ఈ నువ్వుల సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖరీఫ్‌లో వేసే వేరుశనగ, వరి పంటల పెట్టుబడికి వినియోగిస్తుంటారు. ప్రారంభంలో చల్లిన నువ్వులకు వాతావరణం కాస్త నష్టం కలిగించినా ఆలస్యంగా వేసిన పంటకు వర్షాలు ఊపిరిపోస్తున్నాయి. దీంతో నువ్వు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



గంభీరం వద్ద కార్లను తనిఖీ చేస్తున్న ఆనందపురం పోలీసులు

తగరపువలస: ఆనందపురం మండలంలో అసాంఘిక కార్యక్రమాలను ముందస్తుగా అడ్డుకునే చర్యల్లో భాగంగా శనివారం పోలీసులు పలుచోట్ల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గతంలో పేకాట క్లబ్‌లు నిర్వహించిన సందర్భాలను దృష్టిలో పెట్టుకుని దిబ్బడిపాలెంలోని ఘట్టమనేని సుభాష్ చందబోస్ లే అవుట్ సమీపంలో రహదారులు, గంభీరం పంచాయతీలోని ఐఐఎం రోడ్డులోని చందన హోటల్ వద్ద ఈ తనిఖీలు చేపట్టారు. పదేపదే ఈ మార్గాల్లో తిరుగుతున్న వాహనాల నంబర్లను రికార్డు చేయడం, ఎక్కడకు వెళ్తున్నారు? తిరిగి ఎప్పుడు వస్తున్నారు? ఎవరెవరు వస్తున్నారు? వంటి వివరాలను 24 గంటలూ పోలీస్ సిబ్బందితో రికార్డు చేయిస్తున్నారు. ఈ తనిఖీలలో ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు పాల్గొంటున్నారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి తవ్వకాలు



పాత సామియ్యవలస వద్ద గోస్తనీనది ఇసుక కోసం తవ్విన గోతులు



మట్టి కోసం నదిలో తవ్విన గోతులు



మజ్జివలస నుంచి సామియ్యవలసకు రహదారిలో తవ్విన గోతులు

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పాత సామియ్యవలసలో ఇసుక, మట్టి కోసం గోస్తనీనది గర్భానికి తూట్లు పొడుస్తున్నారు. భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి సమీపంలో ఉన్న ఈ మార్గంలో ఇప్పటికే గోస్తనీనదిలో పలుచోట్ల పెద్ద గోతులు తవ్వి అందినకాడికి మట్టి, ఇసుక తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నదీ ప్రవాహ మార్గంలో తుమ్మచెట్లు తొలగించి దాని కింద ఉన్న విలువైన మట్టి, ఇసుక నిల్వలను తీసి పోగు చేస్తున్నారు. ఈ తతంగమంతా పంచాయతీ అధికారులు, పద్మనాభం రెవెన్యూ, పోలీసులకు తెలిసినా పట్టించుకోకపోడంతో తవ్వకాలు నిత్యం జాతరను తలపిస్తున్నాయి. మట్టి, ఇసుక తవ్వకున్నందుకు కొందరు అనధికారంగా వీరి నుంచి డబ్బులు వసూలు చేసి కొందరు అవినీతి అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి తరలించే నాటు బండ్లు, ట్రాక్టర్లకు రేట్లు పెట్టి దోచుకుంటున్నారు. నది గర్భంతో పాటు దారి పొడవునా తవ్వకాలు జరుపుకుంటూ పోతుండటం వలన నదికి వరదలు వచ్చినప్పుడు పాత సామియ్యవలసకు మిగిలిన గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడాపెడా తవ్వకాల కారణంగా సమీప గ్రామాల్లోనూ వ్యవసాయ బావులు, బోరుబావులు ఉప్పునీటి మయం అవుతాయని ఆందోళన చెందుతున్నారు. చీకటి పడితే ఇక్కడ నుంచి బయట ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఇసుక, మట్టి రవాణా అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాలకు ఇసుక, ఇటుక బట్టీలు, వ్యవసాయభూములకు ఇది సారవంతమైన మట్టి కావడం వలన డిమాండ్ ఎక్కువగా ఉండటంతో నదీప్రాంతాన్ని గుల్ల చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మట్టి, ఇసుక తవ్వకాలకు క్లోం వేయకపోతే భవిష్యత్తులో వచ్చే వరదలకు నదిని ఆనుకుని ఉన్న పాత సామియ్యవలసతో పాటు మజ్జివలస పంచాయతీ మనుగడకు ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

డయేరియా నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

తగరపువలస: గ్రామాల్లో డయేరియా నివారణకు ప్రతి ఒక్కరు చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఆనందపురం మండలంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గనేతలు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అలాగే నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు తరచూ రసాయన మందులు పిచికారి చేయించాలన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ పని చేయాలన్నారు.